రంజాన్ మాసం ఎంతో పవిత్రమైంది


ఇఫ్తార్ విందులో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ


ముస్లిం మైనార్టీ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ఇఫ్తార్ విందులో సాయిబాబాచారి తదితరులు

చార్మినార్: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. గురువారం సాయంత్రం బహదూర్‌పురా లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రోజంతా ఉపవాస దీక్షలో ఉన్న ఆయన ఇఫ్తార్ విందులో ఉపవాసం విరమించి అక్కడే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లింలు ఐదు సార్లు నిష్టగా నమాజ్ చేస్తూ రోజంతా కఠోరమైన ఉపవాస దీక్షలు కొనసాగిస్తారన్నారు. ఉపవాస దీక్షల అనంతరం బంధువులు, కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులో పాల్గొని ఒకరికొకరు సహకారం అందజేసుకుని రంజాన్ మాసం ముబారక్ తెలియజేసుకుంటారన్నారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలంతా రాత్రి పూట తరావి ప్రార్థనలో భాగంగా ఖురాన్ పఠనం చేస్తూ ఆధ్యాత్మిక వాతావరణంలో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ మోబిన్, ఎమ్మెల్సీ మీర్జా రెహమత్ బేగ్ తోపాటు మాజీ ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

గోల్కొండ రిసాల బజార్‌లో..

గోల్కొండ: ఇఫ్తార్ విందులు ప్రజల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని గోల్కొండ జగదాంబిక అమ్మవారి ఆలయ వృత్తిపని వార్ల సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి అన్నారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో గోల్కొండ రిసాల బజార్‌లో ఇఫ్తార్ విందు జరిగింది. ఈ విందులో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రియాజ్ అలీఖాన్, ఖైరోద్దీన్, ఆజామ్‌ఖాన్, ఇలియాస్ అలీ, ఇమ్రాన్ ఆలీఖాన్, బీజేపీ నాయకుడు బాలాజీ సూర్యవంశీ తదితరులున్నారు.

జేఎన్‌ఎఫ్‌ఏయూ ప్రాంగణంలో..

నాంపల్లి: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్‌ఎఫ్‌ఏయూ ప్రాంగణంలో దావత్–ఏ–ఇఫ్తార్ నిర్వహించారు. ముస్లిం మైనార్టీ విద్యార్థుల కోసం కళాశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా మగ్రీబ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్యఅతిథిగా వర్సిటీ ఉపాధ్యక్షురాలు ఆచార్య కవితా దర్యాణి రావు, ప్రిన్సిపాల్ సీ.హెచ్. శ్రీనివాస్ హాజరయ్యారు. ఇఫ్తార్ విందులు మత సామరస్యాన్ని పెంచుతాయని కవితా దర్యాణిరావు అన్నారు. విద్యార్థుల్లో స్నేహ భావంతో మరింత పెరుగుతుందన్నారు. ప్రతిఏటా కళాశాలలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ప్రేమాభిమానాలకు వేదికలు..
ఇఫ్తార్ విందులు

- పోటాపోటీగా ఏర్పాటు
- ఉనికి చాటేందుకు కొందరు.. పేదల సాకర్యార్థం మరికొందరు
- కిక్కిరిసిపోతున్న కమ్యూనిటీ హాళ్లు, షాదీఖానాలు


ఇఫ్తార్ విందులో అక్బరుద్దీన్ ఒవైసీ (ఫైల్)

గోల్కొండ: ఇఫ్తార్ విందులు హైదరాబాద్ నగర చరిత్రలో ఒక భాగమయ్యాయి. శతాబ్దాల నుంచి హైదరాబాద్ నగర చరిత్రకు ఇఫ్తార్ విందులు ఒక కొత్త శోభను సంతరిస్తున్నాయి. గతంలో తమ మధ్య ఉన్న స్నేహ సంబంధాలను పటిష్టపరుచుకోవడానికి ఇఫ్తార్ విందులు ఇచ్చే వారని ప్రతీతి. రానురాను ఇఫ్తార్ విందులు రంజాన్ మాసంలో నగరానికి ఒక ప్రత్యేకతను చేకూరుస్తూ వస్తున్నాయి. రాజకీయాలకు అతీతంగా ఈ ఇఫ్తార్ విందులు జరుగుతుండడం విశేషం. నేడు నగరంలో పోటా పోటీగా ఇఫ్తార్ విందులు జరగడం మనం అందరం చూస్తూనే ఉన్నాం. ప్రజా ప్రతినిధులు, యువజన సంఘాల వారు వ్యాపార సంఘాల వారు ఇలా ఎవరికి తోచిన విధంగా వారు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నారు. కొందరూ తమ ఉనికిని చాటుకోవడానికి, మరి కొందరు సమాజ సేవ కోసం మరికొందరు ప్రజలు తమను గుర్తించడానికి ఇలా రకరకాలుగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు అవుతున్నాయి. నేడు వివిధ రాజకీయ పార్టీల వారు తమ తమ ప్రాంతాల్లో ప్రజలతో మమేకం కావడానికి ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నారు. కేవలం మసీదులకే కాకుండా ఇఫ్తార్ విందులు కాలక్రమేనా షాదీఖానాలు, ప్లేగ్రౌండ్‌లు, కమ్యూనిటీహాళ్లలో జరగడం ప్రారంభమైంది. ఇఫ్తార్ విందుల వేదికలు ప్రజల మధ్య ఉన్న ప్రేమాభిమానాలు పటిష్టం చేయడమే కాకుండా కొత్త వారితో పరిచయాలు చేసుకోవడానికి కూడా ఉపయోగపడుతున్నాయి. మొదట్లో కేవలం పండ్లు, పిండి వంటలు, హలీంలకే పరిమితమైన ఇఫ్తార్ విందులు, బిర్యానీతో పాటు ఇతర హైదరాబాదీ వంటకాలకు వేదికలుగా మారాయి.

యువతలో జోష్...

నేడు నగరంలో జరుగుతున్న ఇఫ్తార్ విందుల్లో ఎక్కువగా యువకులు, యువజన సంఘాల వారే ఏర్పాటు చేస్తున్నారు. ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న యువకులు, వ్యాపారంలో ఉన్న యువకులు కలిసికట్టుగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి స్థానికంగా అందరిని ఆహ్వానిస్తున్నారు. ఒకరకంగా తమ వ్యాపారాన్ని పెంచుకోవడమే కాకుండా యువకులు తమలో ఉన్న సేవా దృక్పథాన్ని చాటుకోవడానికి ఇఫ్తార్ విందుల ద్వారా ప్రయత్నిస్తున్నారు.

దశాబ్ద కాలంగా ఏర్పాటు చేస్తున్నాం..



సమాజ సేవ చేయడానికి ఇఫ్తార్ విందుల ఏర్పాటు మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. సమాజ సేవతో పాటు ఇఫ్తార్ విందుల వల్ల యువతకు గుర్తింపు కూడా లభిస్తుంది. ఇఫ్తార్ విందుల సమయంలో పేదలకు కూడా ప్రత్యేకంగా అన్నదానం చేస్తున్నాం. రంజాన్ మాసం రాగానే ఎంతో ఉత్సాహంతో స్నేహితులతో కలిసి ఇఫ్తార్ పార్టీలు గత దశాబ్ద కాలంగా ఏర్పాటు చేస్తున్నాం.

– ఇమ్రాన్ అలీఖాన్, గోల్కొండ

మతసామరస్యానికి వేదికలు..



ఇఫ్తార్ విందులు తమసామరస్యానికి వేదికలు హిందూ ముస్లింలు అంతా ప్రేమాభిమానాలతో పలకరించుకుంటూ ఇఫ్తార్ విందుల్లో పాల్గొనడం ఒక గొప్ప విషయం. గత నాలుగు దశాబ్దాలకు పైగా ఇఫ్తార్ విందుల ఏర్పాటులో భాగస్వామిగా ఉంటూ వస్తున్నా. ఈ సందర్భంగా హిందూముస్లిం అనే బేధం లేకుండా సహపంక్తి భోజనం చేసే అదృష్టం కలిగింది.

– సాయిబాబాచారి, జగదాంబిక అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు

భట్టి విక్రమార్కను కలిసిన మాణిక్‌రావు



అబిడ్స్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను దళితరత్న అవార్డు గ్రహీత, గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు మాణిక్‌రావు గురువారం కలిశారు. ఈ సందర్భంగా మాణిక్‌రావును భట్టి అభినందించారు. హైదరాబాద్‌తో పాటు చేవెళ్ల నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

కార్వాన్‌లో బీఆర్‌ఎస్ ఖాళీ?


మిత్ర కృష్ణ

గోల్కొండ: కార్వాన్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మిత్ర కృష్ణ బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. గురువారం ఆయన మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు రాజీనామా లేఖను పంపారు. బీఆర్‌ఎస్ పార్టీ తరఫున ఆయన జియాగూడ కార్పొరేటర్‌గా గెలిచారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కార్వాన్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. కాగా కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పూర్తిగా ఖాళీ అవుతుంది. పార్టీ ఆవిర్భావం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన టి.జీవన్‌సింగ్ సైతం గత వారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. బలమైన నాయకులు ఇద్దరి రాజీనామాతో కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఖాళీ అయినట్లే. జీవన్‌సింగ్‌తో పాటు మిత్ర కృష్ణ ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారో చూడాల్సి ఉంది.

వాసవీ క్లబ్ సమాజ సేవకే అంకితం



అబిడ్స్: వాసవీ క్లబ్ హైదరాబాద్ సమాజ సేవకు అంకితమని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, అధ్యక్షుడు వరకుమార్‌గుప్తా, మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ చీకటి మర్ల పేర్కొన్నారు. గురువారం బూర్గుల రామకృష్ణారావు మహిళా స్కూల్స్‌లో స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..వాసవీ క్లబ్ హైదరాబాద్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో సామాజిక దృక్పథంతో సేవా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పేద, బడుగు వర్గాల విద్యార్థుల కోసం, అనాథాశ్రమాల అభివృద్ధికి క్లబ్ ముందిండి సేవలందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కన్వీనర్ శ్రీనివాస్, ప్రాజెక్టు చైర్మన్ చల్లా శివకుమార్, మంచాల అంబరిష, అడుగుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


శ్యామ్ మోహన్‌ను సన్మానిస్తున్న గౌరీ సతీష్, వీ.హన్మంతరావు

అబిడ్స్: ఏఐసీసీ మేనిఫెస్టో సభ్యుడిగా నియమితులైన తెలంగాణ కాంగ్రెస్ ఇంటలెక్చుల్ ఫోరం అధ్యక్షుడు శ్యామ్‌మోహన్‌కు ఘనంగా సన్మానించారు. ఆయనను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీ. హన్మంతరావు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జాతీయ స్థాయిలో మేనిఫెస్టో సభ్యుడిగా నియమితులు కావడం ఎంతో అభినందనీయమన్నారు.

అజిందర్‌రెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం


అజిందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జియాగూడ: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రధానోపాధ్యాయులు అజిందర్‌రెడ్డి ఎంతో సేవ చేశారని మంగళ్‌హట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి శారద అన్నారు. గురువారం జియాగూడ న్యూ గంగానగర్‌లోని మంగళ్‌హాట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.అజిందర్‌రెడ్డికి సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం అజిందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 34 ఏళ్లుగా విద్య సేవ చేశానని, తొమ్మిదేళ్లుగా నుంచి మంగళ్‌హట్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా కృషి చేశానన్నారు. ఉపాధ్యాయులు పద్మ, సరిత, ఊర్మిళ శ్రీ శంకర్‌నాయక్, యుగంధరాచారి, అశోక్, శ్రీనివాస్‌లు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, బౌలి గులాబ్‌సింగ్ పాఠశాల ఉపాధ్యాయులు శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

జీఎన్‌ఐటీఎస్‌లో ఎన్‌ఎస్‌ఐసీ శిక్షణ క్యాంప్


శిక్షణ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

గోల్కొండ: ఔత్సాహికులు స్టార్టప్స్ ఏర్పాటుకు ముందుకు వస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి రుణ సదుపాయం ఉందని నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉపకార్యనిర్వహణ అధికారి టి.ముత్తుకుమారన్ అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా కళాశాలలో ఎంట్రప్రీనియర్‌షిప్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్ అనే అంశంపై ఒకరోజు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముత్తుకుమారన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగానే స్టార్టప్స్‌కు కూడా ప్రత్యేక రుణ సదుపాయం కల్పించిందన్నారు. మోటివేషనల్ స్పీకర్ జి.వాసు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మనో వికాసంతోనే ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఎందరో దేశవిదేశాల్లో అత్యున్నత ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఐసీకి చెందిన పి.అబ్దుల్‌ఖదీర్, డీన్స్ డాక్టర్ మల్లారెడ్డి, డాక్టర్ కల్యాణి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ హిమబిందు, డాక్టర్ కె.వి.ధనలక్ష్మి, కె.వి.సౌమ్య, డాక్టర్ పద్మజ, వందన తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో అవినీతిపై ఉక్కుపాదం మోపాలి



ఏసీబీకి ఫిర్యాదు చేసిన లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాజేష్ నాయక్, డాక్టర్ రవీంద్ర నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అవినీతి నిరోధక శాఖ, రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్రనాయక్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం అండదండలతో మాజీ డైరెక్టర్ గడాల శ్రీనివాసరావు ఇచ్చిన వర్క్ ఆర్డర్‌లో భారీ అవినీతి జరిగిందని, ఇచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణ చర్యల్లో భాగంగా డిప్యూటేషన్ రద్దుచేసిందన్నారు. ప్రస్తుత డీహెచ్ రవీంద్రనాయక్ పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఉత్తర్వులు పాటించకుండా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆరోపించారు. అలాగే డిప్యూటేషన్లు రద్దు అయినప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారిగా ఖమ్మం జిల్లా నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఓ అధికారి అర్హత లేనప్పటికీ వివిధ హోదాల్లో పనిచేస్తుందన్నారు. ఈమెపై చర్యలు తీసుకోవాల్సిన డీహెచ్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ప్రాథమిక దశలోనే కేన్సర్‌ను గుర్తించాలి


డిజిటల్ మమ్మోగ్రఫీ స్క్రీనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

నాంపల్లి: స్క్రీనింగ్ ద్వారానే కేన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించే అవకాశం ఉందని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. బ్రెస్ట్ కేన్సర్ పట్ల మహిళల్లో అంతగా అవగాహన లేదని, దానివల్ల బ్రెస్ట్ కేన్సర్ చివరి దశకు వచ్చే వరకు గుర్తించలేకపోతున్నారని తెలిపారు. గురువారం ఏసీగార్డ్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో సువెన్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో రూ.64 లక్షలతో ఏర్పాటు చేసిన డిజిటల్ మమ్మోగ్రఫీ స్క్రీనింగ్ సెంటర్‌ను డాక్టర్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సెంటర్‌లో మహిళలకు బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయనున్నట్లు పేర్కొన్నారు. బ్రెస్ట్ కేన్సర్‌పై స్వచ్ఛంద సంస్థలు మహిళల్లో అవగాహన కల్పించాలని ఆయన కోరారు. బ్రెస్ట్ కేన్సర్ సేవలను పెంపొందించే గొప్ప ప్రయత్నంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సంస్థ ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రితో కలిసి పనిచేసే అవకాశం లభించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నామని సువెన్ లైఫ్ సైన్సెస్ చైర్మన్ వెంకట్ జాస్తి అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు డాక్టర్ జ్యోతిరెడ్డి, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.


నేడు యౌముల్ ఖురాన్ సభ

శాలిబండ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో రానున్న ఐదు శుక్రవారాల పాటు నిర్వహించే యౌముల్ ఖురాన్ సభలో భాగంగా మూడో శుక్రవారం సందర్భంగా మజ్లిస్ బచావ్ తెహ్రీక్ (ఎంబీటీ) ఆధ్వర్యంలో యౌముల్ ఖురాన్ సభ ఉంటుందని మక్కా మసీదు నిర్వాహకులు తెలిపారు.

డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు విశేష స్పందన

గోల్కొండ: ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి తాము చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ కృష్ణమూర్తి అన్నారు. గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందని ఆయన అన్నారు. ప్రయాణికుల కోరిక మేరకు వారు సూచించిన రూట్‌లను ముందుగా తాము పరిశీలిస్తామన్నారు. మంచి ఆక్యూపెన్సీ ఉన్నా లేకున్నా ప్రయాణికుల విన్నపాలను తప్పకుండా నెరవేర్చడానికి కృషి చేస్తున్నామన్నారు. కాలనీ సంఘాలు, గ్రామ పంచాయతీలతో పాటు రైతుల నుంచి కూడా తమకు బస్సు సర్వీసు నడపడంపై సలహాలు, సూచనలు వస్తున్నాయని ఆయన అన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు


లింగయ్య గౌడ్

చార్మినార్: రంజాన్ మాసంలో పాతబస్తీలోని చార్మినార్ డివిజన్ పరిధిలో ఎక్కడ ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలం చార్మినార్ డీఈ లింగయ్య గౌడ్ తెలిపారు. దక్షిణ మండలంలోని అన్ని ఏఈ, ఏడీఈ కార్యాలయాల పరిధిలో తమ సిబ్బంది రెగ్యులర్‌గా విధి నిర్వహణలో ఉన్నారన్నారు. ఎక్కడైన విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే తమ అధికారులతో పాటు సిబ్బందిని సంప్రదించాలన్నారు. రంజాన్ మాసంలో విద్యుత్ సమస్యల ఫిర్యాదుల కోసం సెంట్రల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో పాటు పాతబస్తీలోని ఆయా ప్రాంతాల ప్రజలు తమ పరిధిలోని విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసే విధంగా తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

నిబంధనలకు అనుగుణంగా వ్యాపారాలు కొనసాగించాలి


శ్రీనివాస్ రావు

చార్మినార్: పాతబస్తీలోని మద్యం దుకాణాలతో పాటు బార్ షాప్స్ నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలకు అనుగుణంగా తమ తమ వ్యాపారాలను కొనసాగించాలని చార్మినార్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్‌రావు అన్నారు. చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం 'సాక్షి'తో మాట్లాడుతూ..తాను 2008–09లో ఇక్కడే సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధినిర్వహణ కొనసాగించినందున..పాతబస్తీ తనకు సుపరిచితమేనన్నారు. ఇక వైన్ షాప్స్ సమయ పాలనతో పాటు మద్యాన్ని నిర్దేశిత రేట్లలోనే విక్రయించాలన్నారు. తమ పరిధిలో 14 వైన్ షాప్‌లు, 10 బార్ అండ్ రెస్టారెంట్లున్నాయన్నారు. వైన్ షాప్‌లు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్స్ ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు పని చేస్తాయన్నారు.

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి


కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఏరియా ఆసుపత్రిలో, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు 3 నెలలుగా జీతాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా తెలిపారు. గురువారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌కు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో చాలా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదని ఈ జీతాల కోసం ఈ నెల 26 నుంచి ఒక గంట నిరసన కార్యక్రమం తెలియజేస్తున్నామన్నారు. ఈ నెల 31వ తేదీలోపు జీతాలు చెల్లించాలని లేని పక్షంలో ఏప్రిల్ 1 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తామని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

'కాంగ్రెస్ నాయకులది అహంకార ధోరణి'


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్

గోల్కొండ: కాంగ్రెస్ నాయకులు అహంకారంతో వ్యవహరిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని సీనియర్ బీజేపీ నాయకుడు, బీజేపీ రాష్ట్ర ఎన్నికల క్యాంపెన్ ఇన్‌చార్జి దేవర శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన గుడిమల్కాపూర్‌లోని తన కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల ధోరణిని ఎండగట్టారు. చెంగిచెర్లలో బీజేపీ నాయకుడు బండి సంజయ్‌ను అరెస్టు చేయడం ఏమాత్రం పనికి రాని విషయమన్నారు. అదే విధంగా బుధవారం గుడిమల్కాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ నాయకుడు అజరుద్దీన్ కోడలు అన్నంమీర్జా నిర్వహిస్తున్న ఓ వ్యాపార కార్యక్రమానికి భారీ బందోబస్తును ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ఒక ఏసీపీతో సహా ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ స్వయంగా పరిశీలించారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు నామా యాదగిరి నేత తదితరులున్నారు.



మహిళా సాధికారతకు కృషి


వేడుకల్లో పాల్గొన్న శశిశ్రీ తదితరులు

సుల్తాన్‌బజార్: మహిళా సాధికారతతో పాటు మహిళా ఉద్యోగుల సమస్యలపై తమ సంఘం కృషి చేస్తుందని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కాకుమాను శశిశ్రీ అన్నారు. గురువారం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ భాషా నియలంలో సంఘం 2వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళా దినోత్సవం నిర్వహించి పలు రంగాల్లోని మహిళలను సత్కరించారు. అనంతరం శశిశ్రీ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ఈ సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అవయవదాన సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కాట్రగడ్డ భారతి, రోటరీ క్లబ్ సికింద్రాబాద్ అధ్యక్షురాలు కల్యాణి, మాజీ అధ్యక్షురాలు గిరిజ సంపత్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయనిర్మల, కోశాధికారి డాక్టర్ షీలా రాణి, ఉపాధ్యక్షురాలు డాక్టర్ రమాదేవి, సుజాత, లక్ష్మీ, ప్రశాంతి, హేమలత, సీనా మాథ్యూస్, భాగ్య పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు మజ్లిస్ అండ


వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: వృద్ధులు, వికలాంగులకు అండగా ఉండడమే కాకుండా మజ్లిస్ పార్టీ తరఫున కూడా వారికి సహాయ సహకారాలు అందిస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం టోలిచౌకిలోని ఆయన కార్యాలయానికి కార్వాన్‌కు చెందిన ఓ వృద్ధుడు వచ్చి కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజా దర్బార్‌లో ప్రభుత్వ సహాయం కోసం అందిన దరఖాస్తుల పరిశీలన ఎన్నికల కారణంగా పెండింగ్‌లో ఉందన్నారు. తప్పకుండా అర్హులైన వారికి ఆసరా పింఛన్ వచ్చేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రభుత్వం గత ప్రజాదర్బార్‌లో దరఖాస్తు చేసుకోని వారికి మరో అవకాశం ఇవ్వనుందని పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తర్వాత సంక్షేమ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ జరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. సరైన ధ్రువపత్రాలతో దరఖాస్తు సమర్పించుకుంటే వాటికి మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలి


ప్రైవేట్ స్కూల్ నుంచి చెక్కు అందుకుంటున్న డీసీ సరిత

చార్మినార్: ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి దోహదం చేయాలని జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్–9 డిప్యూటీ కమిషనర్ సరిత అన్నారు. పురానీహవేలీలోని సక్సెస్ స్కూల్ యాజమాన్యం బకాయిపడిన రూ.6.5 లక్షల ఆస్తి పన్నును గురువారం డీసీ అధికారుల బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పెండింగ్ ఆస్తి పన్ను వసూలు కోసం వారెంట్లు సైతం అందజేస్తున్నామన్నారు. సకాలంలో ఆస్తి పన్నులను చెల్లించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛాముండేశ్వరి, సిబ్బంది అక్బర్, విశల్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు



గౌలిపురా: ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఛత్రినాక డివిజన్ ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్ హెచ్చరించారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని గౌలిపురా మార్కెట్, సుల్తాన్‌షాహీ, కవేలికమాన్ తదితర ప్రాంతాల్లోని రౌడీషీటర్ల ఇంటికి గురువారం ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్ వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సీహెచ్.నవీన్, ఏఎస్సై రంగనాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.